## యోగా ఆలకిస్తే భాగ్యం ఆచరిస్తే యోగం...! : సర్పంచ్ ఆలం శిరీష....






**నార్పల జూన్ 21 ఫోకస్ అనంత**

మండలం బొందలవాడ గ్రామంలో ఘనంగా యోగ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఆలం శిరీష, ఉప సర్పంచ్ ఆల వెంకట నరసానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆలం శిరీష మాట్లాడుతూ యోగా ద్వారా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని అందుకోసం ప్రతిరోజు ఒక అర్ధగంట సమయం కేటాయించి అందరూ యోగా చేయాలన్నారు. యోగ చేయడం ద్వారా మంచి ఆరోగ్యంగా ఉంటారన్నారు. యోగా ద్వారా మానవునికి పలు ఆరోగ్య సమస్యలు దూరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్పి జిల్లా కోఆర్డినేటర్ సౌజన్యకుమారి, మాధవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్వో దాదా పీర్ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువత పోరును విజయవంతం చేయాలి

**- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపు**
**- వైఎస్ఆర్సీపీ జిల్లా కార్యాలయంలో 'పోస్టర్లు ఆవిష్కరణ**






**అనంతపురం, జూన్ 21 ఫోకస్ అనంత**

నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ఈనెల 23వ తేదీన అనంతపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించే 'యువత పోరు' ధర్నాను విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 'యువత పోరు' పోస్టర్లు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా అనంత వెంకటరామిరెడ్డి హాజరై దిశానిర్దేశం చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి యువజన విభాగం ఎంతో కీలకమని అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గురించే ఆలోచిస్తుందని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలు మోసానికి గురవుతున్నారన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా ఉద్యోగాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా తొలగిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 23వ తేదీన అనంతపురం కలెక్టరేట్ ఎదుట యువజన విభాగం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యువతను భాగస్వామ్యం చేసుకుని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని అనంత మండిపడ్డారు. కేసులకు ఎవరూ భయపడొద్దని సూచించారు. ప్రజల పక్షాన పోరాట చేయాలని యువజన విభాగం నేతలకు సూచించారు.

**హామీల అమలుకు యువజన విభాగం పోరాటం..**

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం వైసీపీ యువజన విభాగం పోరాటం చేస్తుందని యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ తెలిపారు. ఎన్నికలకు ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, లేని పక్షంలో నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారన్నారు. ఏటా జనవరి 1వ తేదీనే జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదని తెలిపారు. ఏడాది గడిచినా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని, ఒక్కరికీ నిరుద్యోగ భృతి అందకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా పీకేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ హయాంలో 6800 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక నోటిఫికేషన్ రద్దు చేశారన్నారు. మెగా డీఎస్సీ పేరుతో చంద్రబాబు, లోకేష్ తొలి సంతకాలు చేసినా ఇప్పటికీ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. వైఎస్ జగన్ హయాంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి 1.25 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎండీయూ ఆపరేటర్లు, ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేసే సూపర్‌వైజర్, సేల్స్‌మన్లను తొలగించి యువతను నిరుద్యోగులుగా మార్చారన్నారు.

**బాబుగారూ..బటన్ నొక్కలేకపోతున్నారా..?**

"వైఎస్ జగన్ హయాంలో సంక్షేమ పథకాలను అందిస్తే ముసలోడు కూడా బటన్ నొక్కుతాడు అని చంద్రబాబు అవహేళన చేశారు. ఈ రోజు అదే ముసలోడిని అడుగుతున్నాం. బటన్ సరిగ్గా నొక్కలేకపోతున్నారా? మా ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకాన్ని అమలు చేశాం. ఇప్పుడు తల్లికి వందనం అని పేరు మార్చారు. రాష్ట్రంలో 60 లక్షల మందికి పైగా లబ్ధిదారులుంటే కేవలం 30 లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం అందించారు. వైఎస్ జగన్ అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి తల్లులకు రూ.13 వేలు అందించారు. రూ.2 వేలను స్కూళ్ల అభివృద్ధికి కేటాయించి నాడు%-%నేడు ద్వారా అభివృద్ధి చేశారు. అప్పట్లో చంద్రబాబు, లోకేష్, కూటమి నేతలంతా అమ్మ ఒడిలో రూ.2 వేలు జగన్ కోత పెట్టాడని విమర్శించారు. ఆ డబ్బు జగన్ జేబులోకి వెళ్తోందని అన్నారు. అప్పట్లో మీరు తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తామని, కోతలుండవని హామీ ఇచ్చారు. కానీ నేడు జరుగుతోంది ఏంటి? రూ.15 వేలలో రూ.2 వేలు కోత పెట్టారు. ఇప్పుడు మీ అమ్మ మొగుడి జేబులోకి వెళ్తోందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటం చేస్తాం" అని సాకే చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఈనెల 23వ తేదీన యువజన విభాగం ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. యువజన విభాగం నాయకులు, కార్యకర్తలంతా 'యువత పోరు'ను విజయవంతం చేయాలన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతినాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, నగర అధ్యక్షుడు శ్రీనివాస్ దత్త, ఉపాధ్యక్షుడు ఉదయ్, ప్రధాన కార్యదర్శి హిదాయతుల్లా, యువజన విభాగం నాయకులు మైను, సోహైల్, సాయికృష్ణ, బాలిరెడ్డి, కుమార్, జగదీష్, వేణు, బాబా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కింద ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీరు వెళ్లేలా చూడాలి

**5 పేజి తరువాయి**

గ్రామాలకు నీరు వెళ్లాలని, ఇప్పుడైనా కార్మికుల విధులకు రావాలన్నారు. సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ పద్ధతులు ఏమున్నాయో మాట్లాడుతున్నామన్నారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కింద రెగ్యులర్ గా సమావేశం చేస్తామన్నారు. ఇప్పటినుంచి అన్ని వివరాలు సక్రమంగా తనిఖీ చేయాలని ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈని ఆదేశించారు. ఈ పథకం సక్రమంగా అమలు కావడానికి ప్రజాప్రతినిధులతో కలిసి అమరావతికి వెళ్లి మాట్లాడుతామని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వ దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. కార్మికుల నాయకుల నుంచి సానుకూల స్పందన ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు మొత్తం పెండింగ్ వివరాలు అందజేయాలని ఆదేశించారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలి..

**అందుకు అవసరమైన సహకారం అందిస్తాం :**
**ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని, అందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసి ఈ పథకం కింద అవసరమైన డబ్బులు తీసుకువస్తామన్నారు. అధికారులు కూడా డబ్బులు కట్టకపోతే సంబంధిత కాంట్రాక్టర్ లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పీఎఫ్ బకాయిలకు సంబంధించి 16 లక్షల రూపాయలు వచ్చే మంగళవారంలోపు కట్టించాలన్నారు. పాత బకాయిలను బిల్లులు వచ్చిన వెంటనే క్లియర్ చేస్తామన్నారు. రెండు నెలల పెండింగ్ బకాయిలు కూడా చెల్లించేలా చూస్తామన్నారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా తాము తోడుగా ఉంటామన్నారు. గతంలో ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం డబ్బులు ఇస్తున్నారని, దయచేసి కార్మికులు సమ్మె విరమించాలన్నారు. వచ్చే సోమవారం నుంచి పనులు చేయించాలన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాదికాలంగా ఎన్ని నిధులు ఇచ్చారో పూర్తి వివరాలు తెలపాలని ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈకి సూచించారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలు వెనుకబడిన ప్రాంతాలని, నీరు రాక చాలా గ్రామాల్లో ప్రజలు మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. నీటి సరఫరా అత్యవసర సేవ అని, సంబంధిత కాంట్రాక్టర్ల వద్ద తప్పులు ఉన్నాయని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్లతో ప్రభుత్వం ఏం అగ్రిమెంట్లు చేసుకున్నారో వివరాలు చెప్పాలన్నారు. వెంటనే పథకం అమలయ్యేలా చూడాలన్నారు.




శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ఎప్పటికప్పుడు జీతాలు, పిఎఫ్ చెల్లించడం కాంట్రాక్టర్ల బాధ్యత : కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుఈ సందర్భంగా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ఎప్పటికప్పుడు జీతాలు, పిఎఫ్ చెల్లించడం కాంట్రాక్టర్ల బాధ్యత అని అన్నారు. కార్మికులకు కాంట్రాక్టర్లు న్యాయం చేయాలన్నారు. పిఎఫ్ అనేది కార్మికుల హక్కు అని, పిఎఫ్ రూల్స్ ప్రకారం ఎందుకు చెల్లించలేదో చూడాలని, సంబంధిత కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదో తెలపాలన్నారు. కార్మికుల సమ్మె రకరకాల కుట్రలో భాగంగా జరుగుతోందని, దీనిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఓబులు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ ఉన్న రెండు నెలల జీతం అందించాలని, పిఎఫ్ బకాయిలు కట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, ఈఈ మురళీధర్ రావు, డిఈ శిరీష, ఏఈ శ్రీనివాసులు, సంబంధిత కార్మికులు పాల్గొన్నారు.

# హీరోయిన్ శ్రీలీలా పై కేసు నమోదు చేయాలి

**అనంతపురం జూన్ 21 ఫోకస్ అనంత**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇతర రాష్ట్రాల విద్యార్థులు మోసం చేస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థల బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్న హీరోయిన్ శ్రీ లీలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ డిమాండ్ చేశారు. అనంతపురంలో జరిగిన స్టూడెంట్ జేఏసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో అమర్ యాదవ్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు పేరుపొందిన హీరో, హీరోయిన్లను అంబాసిడర్ గా పెట్టుకొని మా విద్యా సంస్థకు ఆ ర్యాంకులు వచ్చేయి, ఈ ర్యాంకులు వచ్చాయని మా స్కూలు, కాలేజీలలో చేరాలని విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తూ వారి నుంచి ఫీజుల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు, పేపర్లలో, మీడియాలో పెద్దపెద్ద ఫ్లెక్సీలతో ఇతర సోషల్ మీడియాలో పోటీ పోటీగా ప్రచారలు చేస్తూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. 10వ క్లాస్ విద్యార్థికి 590 మార్కులు వస్తే ఆ విద్యార్థికి కూడికలు తీసివేతలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విద్యార్థి ఏమో కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివితే 590 మార్కులు వచ్చాయి ఆ విద్యార్థికి ఎందుకు కూడికలు తీసివేతలు రాలేదని కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యా సంస్థలైన శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం, కేశవరెడ్డి, ఎస్సార్, హెచ్.పీ.ఎస్, గ్లోబల్, ఏరా, మెరీడియన్, ట్రేలిస్, ఏ జి ఎస్, మాంటిసోరి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వంటి విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టకొస్తూ విద్యార్థి తల్లిదండ్రులను లేనిపోని ర్యాంకులతో మోసం చేస్తున్నారని అలాంటి విద్యా సంస్థలను జిల్లా నుంచి బహిష్కరించాలని కోరారు మొన్న రోజున వచ్చిన నిట్,జే ఈ ఈ ఫలితాలలో ఒకే విద్యార్థికి రెండు కాలేజీలలో ఎలా ర్యాంకులు వస్తాయని ప్రశ్నించారు. విద్యా వ్యాపారం అంతం కావాలంటే ఆ సంస్థలకు అంబాసిడర్ గా ఉన్న హీరో హీరోయిన్లు, క్రికెటర్లు, ఇతర పేరుపొందిన ప్రముఖులు ఆ సంస్థలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నేతలు అభిరామ్, పోలార్ నరేష్, పార్థసారథి,చరణ్,తేజ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు



## యోగ నిరంతర ప్రక్రియ కావాలి..

**- అంగన్వాడి యోగ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్**




**అనంతపురం,జూన్ 21 ఫోకస్ అనంత**

యోగాను కేవలం ఒక మా సానికే పరిమితం చేయకుండా యోగ నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రూపొందించిన అంగన్వాడీ యోగ పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్. వినోద్ కుమార్, ఐఏఎస్. వి. ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్ననాటి నుండే పిల్లలకు యోగ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, బాలికలు, కి శోర బాలికలు యోగాను అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిత్య యోగ సాధన తో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతి వ్యక్తి యోగ సాధనను అలవర్చుకోవాలని సూచించారు. పెరుగుతున్న పోటీ ప్రపంచంలో ఒత్తిడి నుంచి తట్టుకోవడానికి యోగ మహత్తర సాధనమని ప్రతి ఒక్కరి జీవితంలో యోగ దిన చర్యభాగం కావాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అంతకుముందు ఐసిడిఎస్ జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లకు సంబంధించి వివిధ కారణాల వల్ల సక్రమంగా విధులకు హాజరుకాని ఉద్యోగ , సిబ్బంది తొలగింపు చర్యల పై జిల్లా కలెక్టర్ పలు విషయాలపై సమీక్షించి 20 మంది దాకా తొలగింపులకు కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి యం.నాగమణి, ఉరవకొండ సిడిపిఓ డా.బి .ఎన్. శ్రీదేవి , అనంతపురం సిడిపిఓ ఉమా శంకరమ్మ, తాడిపత్రి సిడిపిఓ సాజిదా బేగం, కనేకల్లు సిడిపిఓ నాగమణి, రాయదుర్గం సిడిపిఓ పద్మావతి, సింగనమల సిడిపిఓ లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భూకబ్జాదారులకు అండగా అర్బన్ తహసీల్దార్

**- జిల్లా కలెక్టర్ ఆదేశాలు భేఖాతర్**
**- తహసీల్దార్ పై చర్యలు తీసుకోవాలని మద్దులచెరువు మల్లి డిమాండ్**


**అనంతపురం జూన్ 21 ఫోకస్ అనంత**

అనంతపురం పట్టణంలోని ఎస్సీ ఎస్టీ ప్రజా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యాలయం మీడియా సమావేశం నందు వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దులచెరువు మల్లి మాట్లాడుతూ అనంతపురం పట్టణంలోని బస్టాండ్ కు కుతవేటు దూరంలో గల 94 సర్వేనెంబర్ వంక పోరంబోకు స్థలం లో పట్టణంలోని ప్రభుత్వ వైద్యుడు కోట్లాది రూపాయలు విలువచేసే 12:30 సెంట్లు స్థలాన్ని కబ్జా చేశాడు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ గారికి ఎస్సీ ఎస్టీ ప్రజా సమాఖ్య ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ గారు వెంటనే స్పందించి ఈ స్థలాన్ని వెంటనే విచారణ జరిపి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని స్థానిక ఆర్డిఓ, తహసీల్దార్ కు ఆర్డర్ వేయగా తహసీల్దార్ వి చారణ పేరిట కాలయాపన చేస్తూన్నారు. పేదవాడు ఎక్కడైనా పూరిగుడిసె వేసుకుంటే ఇక్కడ ఉండే అధికారులే వందల మంది పోలీసులు తీసుకెళ్లి గుడిసెలను తొలగించి వారి పైన అక్రమ కేసులు పెట్టడం జరుగుతుంది. అదే డబ్బుండేవాడు ప్రభుత్వ స్థలాలు కబ్జాలు చేస్తే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటని వెంటనే కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారుల పైన చర్యలు తీసుకొని వంక పోరంబోకు స్థలాలన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.




## ఘనంగా యోగా దినోత్సవం వేడుకలు

**- యోగ శిక్షకులు ఆసాది లక్ష్మీ నారాయణ కు ఘన సత్కారం**






**నార్పల జూన్ 21 ఫోకస్ అనంత**

మండలంలో ఘనంగా 11వ యోగ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రమైన నార్పల లోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలో, గ్రామ సచివాలయాలలో తోపాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధి హామీ కూలీల ప్రాంతాలలో అధికారుల సమక్షంలో యోగా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల ప్రత్యేక అధికారి రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ మమత దేవి, మండల విద్యాధికారి కృష్ణయ్య ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. నార్పల2 సచివాలయంలో సచివాలయ కార్యదర్శి కెపి పరశురాం అధ్యక్షతన యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.దీనికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పిఎల్ లక్ష్మీనారాయణ, యోగ ప్రత్యేక అధికారిని ఐసిడిఎస్ సూపర్వైజర్ సునాలిని, రాష్ట్ర ఉత్తమ గ్రామీణ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు,సీనియర్ పాత్రికేయులు,సామాజిక సేవ కార్యకర్త, యోగా శిక్షకులు ఆసాది లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగా విశిష్టత ఔన్నత్యం గురించి వారు మాట్లాడుతూ. యోగ మనిషి జీవన విధానంలో భాగం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్యగా యోగా చేయడం వల్ల మందులు లేని జీవితం అనుభవించొచ్చు అన్నారు. అంతకుముందు యోగ దినోత్సవం పురస్కరించుకుని జ్యోతి ప్రజలను చేసి ప్రార్థనతో ప్రారంభించారు. అనంతరం యోగ ప్రతిజ్ఞ చేశారు. యోగ శిక్షకులు ఆసాది లక్ష్మీనారాయణ సమక్షంలో యోగాసనాలు చేయించారు. ప్రాణాయామం ధ్యానం చేశారు. యోగ విశిష్టత గురించి ప్రస్తుతం యోగాంధ్ర కార్యక్రమం గురించి కవి, గాయకుడు ఆసాది లక్ష్మీనారాయణ స్వయంగా రచించిన పాటను ఆలపించి వినిపించారు. కవి, గాయకులు, రాష్ట్ర ఉత్తమ గ్రామీణ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత,యోగ శిక్షకులు లక్ష్మీనారాయణను అధికారులతో పాటు నాయకులు శాలువా పూల మాలలతో ఘనంగా సత్కరించారు.రాష్ట్ర ప్రభుత్వ అందించిన"యోగ అత్యుత్తమ ప్రదర్శన ప్రశంస ధ్రువీకరణ పత్రం అందజేసి అభినందించారు.జాతీయ గీతంతో యోగ వేడుకలు ముగించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తుపాకుల భాస్కర్, రామయ్య, గంజికుంట చరణ్ కుమార్, విష్ణువర్ధన్, స్థానిక సచివాలయ ఉద్యోగులు కేపీ పరశురాం, మైసూరా రెడ్డి,అరుణ,సుధా, శ్రీజ, రామేశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఆదివారం నాడు మంత్రి సత్యకుమార్ యాదవ్**

## ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు

**ధర్మవరం జూన్ 21 ఫోకస్ అనంత**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని స్థానిక ప్రజలు, పార్టీ కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు నేరుగా కలుసుకొని తమ సమస్యలు, అభిప్రాయాలు, వినతులు మరియు అభ్యర్థనలు వెల్లడించవచ్చునని ఆయన తెలియజేశారు. రాష్ట్రంలోని ఆరోగ్య వ్యవస్థను మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్న మంత్రి, ప్రజల అభిప్రాయాలను స్వయంగా తెలుసుకోవడానికి ఈ తరహా సమావేశాలను నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

